సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న అతిథులు, కళాశాల ప్రతినిధులతో ఎమ్మెల్యే మర్రిరాజశేఖర్‌రెడ్డి

● ఇంజినీరింగ్ విద్యార్థులకు శిక్షణ, పరిశోధన తప్పనిసరి

డీఆర్‌డీఎల్ డైరెక్టర్ జీఏ శ్రీనివాస మూర్తి

దుండిగల్,ఏప్రిల్ 20 : విద్యార్థులు తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవడానికి శిక్షణ, పరిశోధన ఎంతో అవసరమని డిఫెన్స్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ లాబోరేటరీ (డీఆర్‌డీఎల్) డైరెక్టర్ జీఏ శ్రీనివాసమూర్తి అన్నారు. దుండిగల్‌లోని ఎంఎల్‌ఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఎల్‌ఆర్ఐటీ) కళాశాలలో సినర్జెమ్ సహకారంతో వెల్డింగ్ ఇన్ నాన్ డిస్ట్రిక్టివ్ టెస్టింగ్(ఎన్‌డీటీ) టెక్నాలజీస్‌తో ఏర్పాటు చేసిన 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'ను శనివారం ప్రారంభించారు. శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ.. విద్యార్థులకు ప్రత్యేక నైపుణ్యాలను అందించేందుకు ప్రయోగశాలలను స్థాపించడం ప్రశంసనీయమని పేర్కొన్నారు. విద్యార్థులకు పుష్కలమైన అవకాశాలు కల్పించడానికి తమ కళాశాల కట్టుబడి ఉన్నదని ఫౌండర్ సెక్రటరీ, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కే శ్రీనివాసరావు, శాస్త్రవేత్తలు సీవీఎస్ మూర్తి, ఎస్ కృష్ణమోహన్, జీవీ శివరావు, ఎం వెంకట్‌రెడ్డి, డాక్టర్ పీ మస్తానయ్యా, పాల్గొన్నారు.

● టీ హబ్‌లో 'ఫ్రాన్స్' కార్యాలయం

సిటీబ్యూరో, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ) : కాన్సులేట్ జనరల్ ఆఫ్ ఫ్రాన్స్ ఇన్ బెంగళూరుకు అనుసంధానంగా పనిచేసే బ్యూరో డీ ఫ్రాన్స్ శాఖను హైదరాబాద్‌లోని టీ హబ్‌లో ప్రారంభించారు. టీ హబ్ సీఈఓ ఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ కార్యాలయం స్టార్టప్ ఎకో సిస్టం వృద్ధి చెందేందుకు దోహదపడుతుందని తెలిపారు.

● కేజీబీవీలో విద్యార్థినులకు అస్వస్థత

హైదరాబాద్, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ)/నిర్మల్ చైన్‌గేట్/నర్సాపూర్(జీ): నిర్మల్ జిల్లా నర్సాపూర్(జీ)లోని కేజీబీవీలో శుక్రవారం రాత్రి భోజనం చేసిన అనంతరం 10 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. వారికి నర్సాపూర్‌లోని ప్రభుత్వ దవాఖానలో చికిత్స అందించారు. వీరిలో మౌనిక, వినంతి, ఆరాధ్యను నిర్మల్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. చికిత్స అనంతరం విద్యార్థులు కోలుకుంటున్నారని అక్కడి వైద్యులు తెలిపారు. ఈ పాఠశాలను శనివారం కలెక్టర్ ఆశీష్‌సంగ్వాన్ తనిఖీ చేశారు. సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. వాటర్ ట్యాంకుపై మూత లేకపోవటంతో వెంటనే ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం మిషన్ భగీరథ ట్యాంకుపైకి వెళ్లి నీటిని పరిశీలించారు. విద్యార్థులు తాగుతున్న మినరల్ వాటర్, వంటకు ఉపయోగించే బోరు వాటర్‌ను పరీక్షించేందుకు శాంపిల్స్ సేకరించారు. మిషన్ భగీరథ ట్యాంకు వద్ద పేరుకుపోయిన చెత్తను శుభ్రం చేయించాలని స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి వీణను ఆదేశించారు.

ముగ్గురు వంట మనుషుల తొలిగింపు

ఫుడ్‌పాయిజన్ ఘటనకు సంబంధించి సిబ్బందిపై చర్యలు తీసుకున్నట్టు నిర్మల్ డీఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన జ్యోతి, అనూష, ఉమ సహాయ వంట మనుషులను తొలగిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. నిర్లక్ష్యం వహించిన నర్సాపూర్ కేజీబీవీ ప్రత్యేక అధికారికి షోకాజ్ నోటీసులు అందజేశారు. ఇక నుంచి ఎప్పటికప్పుడు కేజీబీవీల్లో ఉన్న తాధికారులు తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. ఈ మేరకు తాత్కాలికంగా పలువురు అధికారులను నియమించారు.

ఇటీవల జరిగిన ఫుడ్ పాయిజన్ ఘటనలు

ఏప్రిల్ 20	నర్సాపూర్ కేజీబీవీలో 10 మంది బాలికలు
ఏప్రిల్ 19	సుల్తానాబాద్ సాంఘిక సంక్షేమ బాలుర హాస్టల్‌లో 25 మంది
ఏప్రిల్ 11	భువనగిరి సాంఘిక సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో 29 మంది.. ఏప్రిల్ 17న ఒకరు మరణించారు.
ఏప్రిల్ 3	నర్సాపూర్ కేజీబీవీలో 25 మంది
మార్చి 22	జనగామ టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్(బాలికలు)లో ఐదుగురు
జనవరి	ముథోల్ సాంఘిక సంక్షేమ గురుకుల కాలేజీలో 76 మంది

పదోన్నతులకు 'టెట్' కష్టాలు

- టెట్ లింకుతో నిలిచిన ప్రమోషన్లు
- ఎన్సీటీఈ, రాష్ట్రం భిన్న వాదనలు
- ముగిసిన టెట్ దరఖాస్తుల గడువు
- మినహాయింపు ఆశించిన టీచర్లకు నిరాశ

హైదరాబాద్, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ): 'గెజిటెడ్ హెచ్ఎం పదోన్నతికి టెట్ అర్హత సరే.. మరీ ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంకు టెట్ అవసరమా? లేదా? స్కూల్ అసిస్టెంట్ నుంచి జీహెచ్ఎం పదోన్నతికి టెట్ అవసరమా? లేదా?' ఇది రాష్ట్ర విద్యాశాఖ వాదనలు..!

'ప్రాథమికోన్నత పాఠశాలల్లో బోధిస్తున్న ఎస్జీటీలకు లోఫిమేల్ లిట్రసీ రేట్ (ఎల్ఎఫ్ఎల్) హెచ్ఎం పదోన్నతి పొందేందుకు టెట్ అవసరం లేదు. 6, 7, 8 తరగతుల్లో బోధిస్తున్న లాంగ్వేజ్ పండిట్లకు హోదా మారడం లేదు కనుక వీరికి టెట్ అవసరం లేదు. ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ నిర్వహించవచ్చు. 1-5 తరగతులు బోధిస్తున్న వారు హైస్కూల్లో స్కూల్ అసిస్టెంట్ పదోన్నతి పొందేందుకు మాత్రమే టెట్ పేపర్ -2 అవసరం. రాష్ట్ర ప్రభుత్వం టెట్ పాస్ పర్సంటేజీని కుదించవచ్చు. టీచర్లకు ప్రత్యేకంగా టెట్‌ను నిర్వహించవచ్చు. సబ్జెక్టులను బట్టి సిలబస్‌ను నిర్ణయించుకోవచ్చు..' ఇదీ తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) నేతలకు ఎన్సీటీఈ ఇచ్చిన స్పష్టత..!!

ఇలాంటి భిన్న వాదనలు అటు ఎన్సీటీఈ నుంచి రాష్ట్ర విద్యాశాఖ నుంచి వినిపిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం మీద ఎన్సీటీఈ.. ఎన్సీటీఈ మీద రాష్ట్ర ప్రభుత్వం పరస్పరం నెపం వేసి తప్పించుకుంటున్నాయి. ఈ వైఖరి రాష్ట్రంలోని టీచర్ల పదోన్నతులకు అడ్డంకిగా మారింది. పదోన్నతులు వస్తాయని ఆశిస్తున్న వారికి నిరాశ ఎదురవుతున్నది. పదోన్నతులు లభించక నియమితులైన పోస్టులోనే రిటైర్మెంట్ కావాల్సిన పరిస్థితి టీచర్లలో నెలకొన్నది.

కోర్టు కేసుతో బ్రేకులు..

ఎనిమిదేండ్లుగా నిలిచిపోయిన పదోన్నతులకు గత కేసీఆర్ ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్‌నిచ్చింది. దీంతో నిరుడు డిసెంబర్‌లో టీచర్ల పదోన్నతులు, బదిలీలను ప్రక్రియను విద్యాశాఖ చేపట్టింది. తొలుత హెచ్ఎంలను బదిలీచేసింది. ఆ తర్వాత స్కూల్ అసిస్టెంట్లకు గెజిటెడ్ హెచ్ఎంలుగా పదోన్నతుల ప్రక్రియ చేపట్టింది. వాస్తవానికి 1,947 స్కూల్ అసిస్టెంట్లకు గెజిటెడ్ హెచ్ఎంలుగా కల్పించాల్సి ఉండగా, మల్టీజోన్-2లో బదిలీలు, పదోన్నతులపై కేసుల కారణంగా ఈ జోన్ పరిధిలో జిల్లా పరిషత్ స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతులు నిలిచిపోయాయి. మల్టీజోన్-1లోని ప్రభుత్వ స్కూళ్లు, జడ్పీ స్కూళ్లు, మల్టీజోన్ -2 పరిధిలోని ప్రభుత్వ యాజమాన్య స్కూళ్లల్లో అర్హులైన స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతులు కల్పించారు. దీంతో 1,219 స్కూల్ అసిస్టెంట్లు హెచ్ఎంలుగా పదోన్నతి పొందారు. మొదట సీనియార్టీ జాబితా విషయంలో కోర్టు కేసుతో మల్టీజోన్ -2లో జిల్లా పరిషత్ టీచర్ల పదోన్నతులు నిలిచిపోయాయి. ఆ తర్వాత కొందరు టీచర్లు పదోన్నతులకు టెట్ తప్పనిసరి అని.. టెట్ ఉన్నవారికే పదోన్నతులు కల్పించాలని కోర్టు కెళ్లారు. దీంతో మల్టీజోన్ -2లో హెచ్ఎంలతోపాటు, రెండు మల్టీజోన్లలో సెకండరీ గ్రేడ్ టీచర్ నుంచి స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులకు బ్రేకులుపడ్డాయి.

స్పష్టత కోరిన విద్యాశాఖ

విద్యాహక్కు చట్టం, ఎన్సీటీఈ నిబంధనల ప్రకారం టీచర్ల పదోన్నతులకు టెట్ అర్హత తప్పనిసరి. టీచర్ల నియామకంతోపాటు పదోన్నతులకు సైతం టెట్ తప్పనిసరి అని ఎన్సీటీఈ స్పష్టంచేసింది. సెకండరీ గ్రేడ్ టీచర్లు స్కూల్ అసిస్టెంట్లుగా, స్కూల్ అసిస్టెంట్లు గెజిటెడ్ హెచ్ఎంలుగా పదోన్నతి పొందాలంటే టెట్ -2లో ఉత్తీర్ణత కావాలి. పదోన్నతులకు టెట్ తప్పనిసరి కావడంతో 2015లోపు టీచర్లంతా ఉత్తీర్ణులు కావాలని కేంద్ర ప్రభుత్వం గడువు విధించింది. ఆ తర్వాత మరో ఐదేండ్లకు పొడిగించారు. రాష్ట్రంలో విద్యాశాఖ కొత్త రిక్రూట్‌మెంట్ వరకే టెట్‌ను అమలుచేసింది. టెట్‌తో సంబంధం లేకుండానే పదోన్నతులు కల్పించింది. దీనిపై అభ్యంతరం తెలుపుతూ కొందరు హైకోర్టుకు వెళ్లారు. పలు అంశాలపై రాష్ట్ర విద్యాశాఖ ఇటీవలే ఎన్సీటీఈ చైర్మన్‌ను కలిసి స్పష్టత కోరింది. దీనిపై ఎన్సీటీఈ స్పష్టతనివ్వలేదని విద్యాశాఖ వర్గాలు వెల్లడించాయి.

ఎన్సీటీఈ చైర్మన్‌ను కలిసిన తపస్ నేతలు

టెట్‌పై స్పష్టత కోరుతూ తపస్ ప్రతినిధి బృందం శనివారం ఢిల్లీ వెళ్లి ఎన్సీటీఈ చైర్మన్‌ను కలిసింది. తపస్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు హనుమంతరావు, నవాత్ సురేశ్, సహాధ్యక్షుడు అయిల్నేని నరేందర్‌రావు అదనపు ప్రధాన కార్యదర్శి టీ పెంటయ్య, ఉపాధ్యక్షుడు వోడ్నాల రాజశేఖర్, ఎస్ వెంకట్‌రెడ్డి ఎన్సీటీఈ చైర్మన్ యోగేశ్ సింగ్‌తో సమావేశమయ్యారు. ఎస్జీటీ నుంచి స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ) పదోన్నతి కల్పించేందుకు మాత్రమే టెట్ అవసరమని, మిగతా పదోన్నతులకు టెట్ అవసరం లేదని ఎన్సీటీఈ చైర్మన్ తమకు స్పష్టతనిచ్చినట్టు తపస్ నేతలు తెలిపారు. టీచర్లకు ప్రత్యేకంగా టెట్‌ను నిర్వహించవచ్చని, సిలబస్‌ను తగ్గించవచ్చని, ఎన్సీటీఈ నిబంధనలు సడలించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంటుందని తమకు తెలిపినట్టు నేతలు వెల్లడించారు. అయితే, టెట్ దరఖాస్తుల గడువు ఇప్పటికే ముగిసింది.

డీసెండింగ్ ఆర్డర్‌లో పోస్టులు భర్తీ చేయండి

ట్రిబ్‌కు పలువురు గురుకుల అభ్యర్థుల వినతి

హైదరాబాద్, ఏప్రిల్20 (నమస్తే తెలంగాణ): గురుకుల పోస్టులను డీసెండింగ్ ఆర్డర్‌లో భర్తీ చేయాలని తెలంగాణ రెసిడెన్షియల్ ఇనిస్టిట్యూషన్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ట్రిబ్) అధికారులకు అభ్యర్థులు విజ్ఞప్తి చేశారు. పోస్టులేమీ మిగలకుండా నియామకాలను చేపట్టాలని హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాలని కోరారు. శుక్రవారం ట్రిబ్ అధికారులను గురుకుల అభ్యర్థులు శివశంకర్‌గౌడ్, సైదులు, రాజు కలిసి హైకోర్టు మధ్యంతర ఉత్తర్వుల ప్రతిని అందజేశారు. గురుకులాల్లోని 9,210 టీచర్ పోస్టుల భర్తీకి ట్రిబ్ పరీక్షలు నిర్వహించి, ఫలితాలను విడుదల చేసిందని తెలిపారు. అయితే, డీఎల్, జేఎల్, పీజీటీ, టీజీటీ పోస్టులను డీసెండింగ్ ఆర్డర్‌లో నింపలేదని, ఫలితంగా ఎక్కువసంఖ్యలో బ్యాక్‌లాగ్‌లు మిగిలిపోతున్నాయని వెల్లడించారు. ఒకే కామన్ పేపర్స్ పెట్టి, రిక్రూట్‌మెంట్‌ను మాత్రం అసెండింగ్ ఆర్డర్‌లో భర్తీ చేయడం వల్ల ఒకే అభ్యర్థి ఒకటికి మించి ఎక్కువ ఉద్యోగాల్లో ఎంపికయ్యారని వివరించారు. ట్రిబ్ బోర్డు అనాలోచిత నిర్ణయం వల్ల అభ్యర్థులకు నష్టం వాటిల్లిందని వాపోయారు. ఈ విషయమై సీఎం , మంత్రులను కలిసి న్యాయం చేయాలని కోరినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు ట్రిబ్ చర్యలు చేపట్టాలని కోరారు.

జూన్ 9నే గ్రూప్-1 ప్రిలిమ్స్!

- పరీక్ష నిర్వహణ ఏర్పాట్లలో టీఎస్‌పీఎస్సీ
- వాయిదాకు నో చాన్స్

హైదరాబాద్, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ): ఒకవైపు రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ కొనసాగుతున్నప్పటికీ మరోవైపు గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షను జూన్ 9వ తేదీనే నిర్వహించడానికి టీఎస్‌పీఎస్సీ ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నది. హాల్‌టికెట్లు కూడా వచ్చే నెలాఖరులోగా విడుదల చేయాలని కమిషన్ అధికారులు భావిస్తున్నారు. ముందుగా ప్రకటించిన తేదీనే పరీక్ష నిర్వహణకు వారు మొగ్గు చూపినట్టు తెలుస్తున్నది. ఇప్పటికే ప్రశ్నపత్రాల రూపకల్పన, తర్జుమా చేయడంతోపాటు పరీక్షా కేంద్రాల గుర్తింపు వంటి పనులు జరుగుతున్నాయి. దీంతో ఈ పరీక్ష వాయిదా వేసే ఉద్దేశమే లేదని తేలిపోయింది. ఇప్పటికే గ్రూప్-1 కోసం అభ్యర్థులు ప్రిపరేషన్‌పై దృష్టి సారించారు. హైదరాబాద్ సహా ఇతర జిల్లాల్లోని కోచింగ్ సెంటర్లలో వేలాది మంది అభ్యర్థులు శిక్షణ పొందుతున్నారు. వివిధ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలోని స్టడీ సర్కిళ్లలో కూడా శిక్షణ పొందుతున్నారు.

ఎన్నికలకు దూరంగా నిరుద్యోగులు

గ్రూప్-1తోపాటు 2, 3, ఇతర పరీక్షల నేపథ్యంలో అభ్యర్థులు లోక్‌సభ ఎన్నికలకు దూరంగా ఉండే అవకాశం ఉన్నదని తెలుస్తున్నది. ఎన్నికల ప్రచారంలో వారి పాత్ర ఉండకపోవచ్చన్న అభిప్రాయాలే ఎక్కువగా వినిపిస్తున్నాయి. వివిధ పార్టీల తరఫున నిరుద్యోగ యువత ప్రచారంలో పాల్గొనే పరిస్థితులు ఇప్పటికే తగ్గినట్టు భావిస్తున్నారు.

ట్విట్టర్‌లోకి ఏసీబీ

హైదరాబాద్, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ అధికారికంగా ట్విట్టర్ (ఎక్స్) ఖాతా తెరిచింది. ఏసీబీ డీజీ సీవీ ఆనంద్ ఆదేశాల మేరకు ఏసీబీ ఎక్స్ హ్యాండిల్‌ను ఆ శాఖ ఉన్నతాధికారులు రూపొందించారు. టోల్‌ఫ్రీ నంబర్ 1064, వాట్సాప్ నంబర్ 9440446106, dg_acb@ telangana.gov.inను వినియోగించుకోవాలని కోరారు.

టీచర్ల డిప్యూటేషన్లు రద్దు

హైదరాబాద్, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో టీచర్ల డిప్యూటేషన్లను విద్యాశాఖ రద్దు చేసింది. ఈ మేరకు పలు జిల్లాల డీఈవోలు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. రిలీవ్ అయిన టీచర్లు ఈ నెల 23న వారి వారి సొంత స్థానాల్లో రిపోర్టు చేయాలని సూచించారు.

అగ్నిప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు

- త్వరలో 104 మీటర్ల ఎత్తయిన వాహనం కొనుగోలు
- అగ్నిమాపక వారోత్సవాల ముగింపులో డీజీ నాగిరెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో హైరైజ్ బిల్డింగ్‌లలో అగ్నిప్రమాదాల నివారణకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని అగ్నిమాపక శాఖ డీజీ వై నాగిరెడ్డి తెలిపారు. ఏప్రిల్ 14 న ప్రారంభమైన అగ్నిమాపకశాఖ వారోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఫైర్ రెస్క్యూ కోసం 104 మీటర్ల ఎత్తు న్న కొత్త వాహనాన్ని కొనుగోలు చేస్తున్నట్టు పేర్కొన్నారు. అగ్నిప్రమాదాలను ఎదుర్కొనేందుకు 39 ఫైరింజన్లు, 18 మినీ ఫైరింజన్లు, ఇతర రెస్క్యూ సామగ్రి అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రతి హైరైజ్ బిల్డింగ్‌లో వాటర్ పంప్‌హౌజ్‌లు, ఫైర్ ఫైటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. నగరంలో ఇప్పటివరకు 6 వేల హైరైజ్ బిల్డింగ్‌లు, 200 మీటర్ల ఎత్తున్న 23 బిల్డింగ్‌లకు అనుమతులు ఇచ్చామని వెల్లడించారు. భవిష్యత్తులో మరో 3వేలకు పైగా భవనాలు నిర్మించే అవకాశం ఉందని, 15 మీటర్లకు పైగా ఎత్తు ఉండే బిల్డింగ్‌లకు ఎన్‌వోసీ తప్పనిసరిగా తీసుకోవాలని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 3వేల మంది కమ్యూనిటీ వలంటీర్లను సిద్ధం చేస్తున్నామని, ప్రస్తుతం వరంగల్‌లో 93 మంది శిక్షణ పూర్తి చేసుకున్నారని వెల్లడించారు. అగ్నిమాపకశాఖ డైరెక్టర్ లక్ష్మీ ప్రసాద్, అడిషనల్ డైరెక్టర్ జీవీ నారాయణ రావు, ఆర్ఎఫ్ఓలు హరినాథ్‌రెడ్డి, సుధాకర్ రావు, డీఎఫ్ఓలు, ఏడీఎఫ్‌లు పాల్గొన్నారు.